క్లుప్తంగా

అన్నదానానికి విరాళాలు



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి శనివారం నందిగామ పట్టణానికి చెందిన ఎ.రాఘవకృష్ణ రూ.10,116 ఆలయ ధర్మకర్త బెజవాడ శ్రీనివాసరావుకు అందజేశారు. అలాగే కంకిపాటి నీరజ్, బెల్లంకొండ స్వప్న రూ.10 వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలు అందజేసి సత్కరించారు.

పిడుగుపాటుకు గడ్డి వాములు దగ్ధం



గండేపల్లి(కంచికచర్ల): పిడుగుపాటుకు రెండు వరిగడ్డి వాములు దగ్ధమైన సంఘటన మండలంలో శనివారం చోటుచేసుకుంది. అగ్నిమాపక కేంద్ర సిబ్బంది తెలిపిన సమాచారం మేరకు మండలంలోని గండేపల్లి గ్రామానికి చెందిన కంఠంనేని కోటేశ్వరరావుకు చెందిన వరిగడ్డి వామిపై పిడుగుపడింది. దీంతో రెండు గడ్డివాములకు మంటలు అంటుకోవటంతో వాములు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక కేంద్ర సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. రూ.70 వేలు ఆస్తి నష్టం జరిగిందని ఫైర్ సిబ్బంది తెలిపారు.

పసుపు కొమ్ముల అలంకారంలో కనకదుర్గమ్మ



నందిగామరూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లోని దేవీ ఆలయాల్లో శ్రావణ పౌర్ణమి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని పల్లగిరి గట్టుపై ఉన్న త్రిశక్తి పీఠంలో వేం చేసి ఉన్న కనకదుర్గ, కనక మహాలక్ష్మి, జ్ఞాన సరస్వతీ అమ్మవార్లను ఆలయ అర్చకుడు రాజేష్ శర్మ పసుపు కొమ్ములతో ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజలు చేశారు. సుగంధ ద్రవ్యాలు, పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చనలు, మూలమంత్ర హోమాది క్రతువులు, అష్టోత్తర సహస్రనామ, పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణతో భక్తి భావం పెంపొందుతుంది



జగ్గయ్యపేట: గిరి ప్రదక్షిణ, గోపూజా వంటి కార్యక్రమాలతో భక్తి భావం పెంపొందుతుందని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పేర్కొన్నారు. మండలంలోని తిరుమలగిరి గ్రామంలో వేం చేసి ఉన్న వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన గిరి ప్రదక్షిణను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం గోమాతకు సీమంతం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ ఏసీ నూతక్కి వెంకట సాంబశివరావు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, ఆలయ చైర్మన్ భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యతా క్రమంలో అన్ని వార్డుల్లో అభివృద్ధి



జగ్గయ్యపేటఅర్బన్: ప్రాధాన్యతా క్రమంలో అన్ని వార్డుల్లో రోడ్లు, డ్రెయిన్లు, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పించి వార్డుల అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అన్నారు. పట్టణంలోని 1వ వార్డు, ఎన్జీవో కాలనీలో రూ.30 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రతో కలిసి ఎమ్మెల్యే తాతయ్య శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ రోడ్డు పూర్తయిన తరువాత కాలనీ ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా సదుపాయం కలుగుతుందన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, నాయకులు లక్ష్మణరావు, గింజుపల్లి కృష్ణ, నరసింహారావు, స్థానికుడు రాజు పాల్గొన్నారు.

హామీల అమలుపై నిలదీయండి

- బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో తన్నీరు
- పేట, నందిగామ నియోజకవర్గాల వ్యాప్తంగా క్యూఆర్ కోడ్ ఆవిష్కరణలు



మాట్లాడుతున్న తన్నీరు నాగేశ్వరరావు, పక్కన ఎంపీపీ గాంధీ, జెడ్పీటీసీ నాగమణి తదితరులు

వెంకటాపురం, తోటచర్ల(పెనుగంచిప్రోలు): మోసపూరిత పాలన చేయటంలో సీఎం చంద్రబాబు దిట్ట అని, ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీలపై నిలదీయాలని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మండలంలోని వెంకటాపురం, తోటచర్ల గ్రామాల్లో బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ కార్యక్రమం మండల పార్టీ అధ్యక్షుడు పొన్నం కోటేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాబు చేస్తున్న మోసాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. కూటమి మోసాలను ప్రతి ఇంటికి వెళ్లి తెలియజేయాలన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు ఎత్తివేయటమే కాకుండా తాము ఇస్తామన్న సూపర్ సిక్స్, ఇతర హామీలను కూడా అమలు చేయకపోవటం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలు తాము మోస పోయామని గుర్తించారని, కూటమిని ఎదిరించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. తల్లికి వందనం చాలా మంది లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ కాలేదని, గ్యాస్ డబ్బులు కూడా అందరికీ అందలేదని, నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి, 50 ఏళ్లకే పింఛన్ పథకాలు ఊసే కూటమి ప్రభుత్వం ఎత్తటం లేదన్నారు. గత జగన్మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి వర్గానికి మేలు జరిగేలా సంక్షేమ పథకాలు రూపొందించి పారదర్శకంగా అమలు చేశారని గుర్తు చేశారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో కలిసి క్యూఆర్ కోడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎంపీపీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, సర్పంచ్ కూచి నర్సయ్య, పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు, జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తపల్లి పెంటయ్య, జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు చేని రాంబాబు, నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు కీసర లోకేశ్వరరావు, మండల పార్టీ ఉపాధ్యక్షులు జక్కులూరి దేవదాసు, తమ్మిశెట్టి సోమయ్య, స్థానిక నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, మాదల ఉగ్ర నరసింహారావు, కోలా రామారావు, అరుణ, తోటచర్ల తదితరులు పాల్గొన్నారు.



నందిగామ ఎనిమిదో వార్డులో..



నందిగామ రెండో వార్డులో..

సామాన్యులకు దూరమైన సంక్షేమం..

నందిగామటౌన్: కూటమి ప్రభుత్వ 13 నెలల పాలనలో సంక్షేమం సామాన్యులకు దూరమైందని వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ మహ్మద్ మస్తాన్ పేర్కొన్నారు. పట్టణంలోని రెండు, ఐదు, ఎనిమిది, తొమ్మిది వార్డుల్లో శనివారం రాత్రి బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబుతో సహా కూటమి నేతలు ఇచ్చిన హామీలు తప్ప అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేసిన దాఖలాలు కనిపించటం లేదన్నారు. పథకాలు అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మాలని కూటమి నేతలు మాట్లాడుతున్నారని దుయ్యబెట్టారు. అమలుకు సాధ్యం కాని హామీలిచ్చి వాటిని అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను పూర్తిగా మోసం చేశారని విమర్శించారు. ఏడాది కాలంగా చంద్రబాబు సాగిస్తున్న అసమర్థ ప్రభుత్వ పని తీరును ఎండగట్టాలని మస్తాన్ పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల ఇళ్ల ముంగిటకు వెళ్లి చంద్రబాబు మోసాలను వివరించాలని తెలిపారు. అనంతరం బాబు మోసాలపై ప్రత్యేకంగా రూపొందించి క్యూఆర్ కోడ్ పత్రాలను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు షేక్ యాకుబ్ ఆలీ, షేక్ ఖాలిక్, నాయకులు దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, నల్లమల్లి మురళి, షేక్ సైదా, షేక్ మున్నా, గాడిపర్తి రామకృష్ణ, షేక్ సుభానీ, షేక్ జాఫర్, యరగొర్ల రామారావు, పోతురాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చందాపురంలో క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న నాయకులు



నందిగామ తొమ్మిదో వార్డులో క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కూటమి పాలనలో ప్రగతి శూన్యం..

చందర్లపాడు(నందిగామరూరల్): కూటమి ప్రభుత్వ 13 నెలల పాలనలో రాష్ట్రం సాధించిన ప్రగతి శూన్యమని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కందుల నాగేశ్వరరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెలగపూడి వెంకటేశ్వరరావులు పేర్కొన్నారు. చందర్లపాడు మండలం పొక్కునూరు, కొడవటికల్లు గ్రామాల్లో శనివారం రాత్రి బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు సర్కారు అధికాంలోకి వచ్చిన నాటి నుంచి రెడ్‌బుక్ పాలన తప్ప గత ప్రభుత్వంలో మాదిరిగా పారదర్శకతతో కూడిన పాలన లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంస్కరణలు, వ్యవస్థలను కూటమి ప్రభుత్వం సమాధి చేస్తోందని దుయ్యబెట్టారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి వస్తున్న ఆదరణ చూసి తట్టుకోలేక అక్రమ కేసులు, విగ్రహాల తొలగింపు, తదితర అరాచక విధానాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే యత్నం చేస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ కేసులకు, రెడ్‌బుక్ రాజ్యాంగానికి భయపడేది లేదని స్పష్టం చేశారు. కూటమి నేతలు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను, ఏడాది కాలంగా అందిస్తున్న పథకాల తీరును పార్టీ నాయకులు, కార్యకర్తలు పూర్తి స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం పొక్కునూరు, కొడవటికల్లు గ్రామాల కన్వీనర్లుగా జెట్టి సత్యనారాయణ, పిన్నిబోయిన శ్రీనివాసరావులను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, గుడేటి శ్రీనివాసరావు, కొమ్మినేని మహేంద్ర, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

13 నెలలైనా ఎటువంటి అభివృద్ధి లేదు..

కంచికచర్ల: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 13 నెలలైనా ఎటువంటి అభివృద్ధి చేపట్టలేదని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు వేమా సురేష్ బాబు అన్నారు. స్థానిక ఇందిరాకాలనీ 5వ సెగ్మెంట్‌లోని 15, 16, 17 వార్డుల్లో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం శనివారం జరిగింది. ఈమేరకు సురేష్‌బాబు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజాసమస్యలు పట్టించుకోకుండా మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలను ధ్వంసం చేస్తుందని హైకోర్టు తీర్పు ఉన్నప్పటికీ పోలీసుల సహకారంతో విగ్రహాన్ని ధ్వంసం చేశారన్నారు. తమ పార్టీ శ్రేణులపై అక్రమ కేసులు పెడుతున్నారని, రానున్న రోజుల్లో కూటమి నాయకులకు తగిన బుద్ధి చెబుతామని మండిపడ్డారు. కూటమి పాలనలో సూపర్ సిక్స్ పథకాలు ఒక్కటి కూడా సక్రమంగా అమలు చేయలేదన్నారు. ప్రతి మహిళ ఖాతాలో నెలకు రూ.1500 జమ చేస్తామని మాట తప్పారని ధ్వజమెత్తారు. రానున్న రోజుల్లో కూటమి నేతలను గ్రామాల్లోకి రానీయకుండా మహిళలే అడ్డుకుంటారని వేమా జోస్యం పలికారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కాలవ పెదబాబు, ఎంపీటీసీ సభ్యులు మాడుగుల మధుబాబు, పట్టణ పార్టీ ఉపాధ్యక్షుడు అమర్లపూడి యోహాన్, నాయకులు వేమా శివకోటి, దేవిరెడ్డి లక్ష్మీనారాయణ, బొక్కిసం భూషణం, పొన్నపల్లి శ్రీనివాసరావు, తుమ్మల గోపాలకృష్ణారెడ్డి, చట్ట రవీంద్ర, బాణావత్ సురేష్, ఉప్పుతల వెంకయ్య, దేవిరెడ్డి శ్రీనివాసరావు, దేవరకొండ గురవయ్య తదితరులు పాల్గొన్నారు.



కంచికచర్లలో క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న వేమా, అమర్లపూడి నాయకులు

అమ్రిత సాయి విద్యార్థుల ఇండస్ట్రియల్ విజిట్



సీ డాక్ సెంటర్‌ను సందర్శించిన అధ్యాపకులు, విద్యార్థులు

కంచికచర్ల: పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాల మూడో సంవత్సరం సీఎస్ఎం, సీఐసీ, సైబర్ సెక్యూరిటీ విద్యార్థులు ఇంజినీరింగ్ కోర్సుల్లో భాగంగా హైదరాబాద్‌లోని సీ డాక్(సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్ కంప్యూటింగ్) హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ సంస్థను సందర్శించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శశిధర్ శనివారం తెలిపారు. సీడాక్ జాయింట్ డైరెక్టర్ సాధు శ్రీనివాస్ విద్యార్థులకు సీడాక్‌లో అత్యాధునిక టెక్నాలజీతో అందుబాటులో ఉన్న 3డీ ప్రింటింగ్ ల్యాబ్‌తో పాటు బిగ్ డేటా ల్యాబ్, క్వాంటింగ్ కంప్యూటింగ్ ల్యాబ్, ఈ శిక్షణ, విశ్లేషణ యాప్ తదితర అంశాల గురించి వివరించారన్నారు. విద్యార్థులు సీ డాక్ సెంటర్‌లో ఇంటర్న్‌షిప్ చేయడానికి కావలసిన విధి విధానాలను తెలియజేశారని పేర్కొన్నారు. ఈ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సైబర్ సెక్యూరిటీలో పట్టు సాధిస్తే మెరుగైన ఉపాధి అవకాశాలు ఉంటాయని తెలిపారు. సీ డాక్ మెంబర్స్ కుమార్, మాధుర్య, వంశీ సంస్థ పురోగతిని, ఐటీ, ఎలక్ట్రానిక్ రంగాల్లో ఈ సెంటర్‌లో పరిశోధన ఏ విధంగా జరుగుతుందో విద్యార్థులకు ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఇటువంటి ఇండస్ట్రియల్ విజిట్ ద్వారా రీసెంట్ టెక్నాలజీపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులను ఇండస్ట్రియల్ అవసరాలకు తగ్గట్టుగా సన్నద్ధం చేయడమే కళాశాల లక్ష్యమని ప్రిన్సిపాల్ తెలిపారు.

జాతీయ రహదారిపై బారికేడ్ల ఏర్పాటు



జి.కొండూరు: మైనర్లు వాహనాలను నడపడం వల్లన ప్రమాదాల బారిన పడి ప్రాణాలను కోల్పోతున్నారని, తల్లిదండ్రులెవరూ మైనర్లకు వాహనాలను ఇవ్వద్దని ఎస్ఐ సతీష్‌కుమార్ అన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా మండల పరిధిలోని నేషల్ హైవే, స్టేట్ హైవేలపై పలుచోట్ల ఇనుప బారికేడ్లు, రేడియం స్టిక్కర్లను అంటించిన ప్లాస్టిక్ డ్రమ్ములను శనివారం ఏర్పాటు చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ మితిమీరిన వేగంతో వాహనాలను నడిపినా, అసంబద్ధ హారన్‌లు మోగించినా, రహదారులపై ఎక్కడపడితే అక్కడ వాహనాలను నిలిపినా అటువంటి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలను నడిపితే రూ. వేయి జరిమానా, డ్రంకెన్ డ్రైవ్ చేస్తూ పట్టుబడితే వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు రూ.10 వేలు జరిమానా, జైలు శిక్ష విధిస్తారని వివరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సహకరించాలని కోరారు.

ఘనంగా రాఖీ పౌర్ణమి పూజలు



శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు



పేటలో శాంతికల్యాణం నిర్వహిస్తున్న జగదీష్ దంపతులు

జగ్గయ్యపేటఅర్బన్: రాఖీ పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బలుసుపాడు రోడ్‌లో ఉన్న శ్రీస్వయం వ్యక్త శ్రీవెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శ్రావణ పౌర్ణమి సందర్భంగా స్వామివారి శాంతి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రముఖ వ్యాపారవేత్త చౌడవరపు జగదీష్, రుక్మిణి దంపతుల ఆధ్వర్యంలో కల్యాణ కార్యక్రమం జరిగింది.



- శ్రీఅన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం(మఠం శివాలయం)లో స్వామి వారికి పంచామృతాలు వివిధ పండ్ల రసాలతో అభిషేకాలు, అన్నాభిషేకం నిర్వహించారు.
- అద్దాలబజారులో ఉన్న శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో సంతోషిమాత అమ్మవారిని పంచామృతాలతో అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

మఠం శివాలయంలో స్వామివారు

వైభవంగా వెంకటేశ్వరస్వామి కల్యాణం



ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): స్థానిక రామమందిరం వద్ద శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని అర్చకులు పరాంకుశం సీతారామాచార్యులు ఆధ్వర్యంలో శనివారం శ్రీవెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆదివాసీల దినోత్సవం

మైలవరం: మైలవరం శ్రీ లీలావతి గిరిజన పాఠశాలలో అంతర్జాతీయ ఆదివాసీల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. గిరిజనుల జీవన విధానాన్ని, వారికున్న ప్రకృతిపై ప్రేమను, పాడి పంటల అభివృద్ధి విధానాన్ని, స్వాతంత్ర్య ఉద్యమంలో వారి త్యాగాన్ని ప్రధానోపాధ్యాయుడు ఉడతా లక్ష్మీనారాయణ వివరించారు. విద్యార్థులు గిరిజనుల వేషధారణతో అలరించారు.

వైఎస్ విగ్రహం తొలగింపుపై కూటమి కుయుక్తులు

- మహానేత విగ్రహ ఆనవాళ్లు కనుమరుగు
- విగ్రహ తొలగింపు వ్యతిరేకతను నివారించేందుకు చర్యలు



గాంధీ సెంటర్‌కు శోభ తీసుకొచ్చిన వైఎస్సార్ విగ్రహం, పైలాన్(ఫైల్)

నందిగామటౌన్: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని అక్రమంగా తొలగించటమే కాకుండా విగ్రహ దిమ్మె ఆనవాళ్లు కూడా లేకుండా చేసేందుకు కూటమి నాయకులు శాయశక్తులా కృషి చేస్తున్నారు. ముఖ్యంగా విగ్రహ దిమ్మెను సైతం శుక్రవారం రాత్రి యంత్రాలతో తవ్వి తొలగించారు. గాంధీ సెంటర్‌కు మణిహారంగా ఉండటంతో పాటు ఆ ప్రాంతానికే శోభ తెచ్చిన మహానేత విగ్రహాన్ని, అభివృద్ధి పనుల గుర్తుగా ఏర్పాటు చేసిన పైలాన్‌ను తొలగించటం ప్రజల్లో చర్చకు దారితీసింది. గాంధీ సెంటర్‌కు వచ్చిన ప్రతి ఒక్కరూ కోర్టు నిబంధనలను బేఖాతరు చేస్తూ అక్రమంగా విగ్రహాన్ని తొలగించారని అంటుండటంతో విగ్రహ తొలగింపుతో మూటగట్టుకున్న వ్యతిరేకతను నివారించేందుకు అదే ప్రాంతంలో మరొక విగ్రహం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అనుచరులు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

గత పాలకుల అభివృద్ధిని లేకుండా చేయాలి..

గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సహకారంతో మాజీ శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్మోహనరావు, శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ చేసిన అభివృద్ధి పనులను నామరూపాలు లేకుండా తొలగించాలనే ఆశయంతో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఉన్నారని, అందులో భాగంగానే మహానేత విగ్రహాన్ని తొలగించారని టీడీపీ కార్యకర్తలే బాహాటంగా చెబుతున్నారు. అధికారంలోకి వచ్చిన తొలి రోజునే అత్యంత భయానక వాతావరణాన్ని సృష్టిస్తూ టీడీపీ నేతలు, కార్యకర్తలు శిలాఫలకాలు, డివైడర్‌లను ధ్వంసం చేసిన విషయం నియోజకవర్గ ప్రజలకు విదితమే.

అభివృద్ధికి చిరునామాగా గాంధీ సెంటర్..

గత ప్రభుత్వ హయాంలో గాంధీ సెంటర్‌లో శిథిలావస్థకు చేరిన చిన్న మహాత్మా గాంధీ విగ్రహాన్ని తొలగించి ఆ స్థానంలో లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించుకున్న నట్ అండ్ బోల్ట్ విగ్రహాన్ని జగన్మోహనరావు, అరుణకుమార్ ఏర్పాటు చేశారు. ఒక వైపు మహానేత విగ్రహం మరో వైపు గాంధీ విగ్రహాన్ని చూసిన ప్రతి ఒక్కరూ జగన్మోహనరావు, అరుణకుమార్ పని తీరును జీర్ణించుకోలేని అధికార పార్టీ ప్రజాప్రతినిధి దివంగత ముఖ్యమంత్రి విగ్రహాన్ని తొలగించారని అన్ని వర్గాలు పేర్కొంటున్నాయి. గాంధీ విగ్రహాన్ని అయినా ఉంచుతారో దానిని కూడా తొలగిస్తారోననే చర్చలు జోరుగా సాగుతున్నాయి.



గాంధీ సెంటర్‌లో మహానేత విగ్రహం తొలగించిన ప్రాంతం

కక్ష సాధింపునకు నిదర్శనం

2010లోని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి విజయవాడ ఎంపీ లగడపాటి రాజగోపాల్ సారథ్యంలో వసంత కృష్ణప్రసాద్, పాలేటి సతీష్, పలువురు నాయకుల ఆధ్వర్యంలో అప్పటి అధికారుల అనుమతులతో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అంతే కాకుండా తూర్పుముఖంగా ప్రధాన మెయిన్ బజార్ చివర శివాలయం వరకు కనిపించేలా ఉండటంతో ఆ ప్రాంతానికి కొత్త శోభను తెచ్చిపెట్టింది అనటంలో అతిశయోక్తి కాదు. ఆ తరువాత రోడ్ల విస్తరణ, అభివృద్ధిలో భాగంగా అస్తవ్యస్థంగా ఉన్న విగ్రహాలను తొలగించి క్రమపద్ధతిలో ఏర్పాటు చేసి ఆ ప్రాంతాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దటం జరిగింది. వీటితో పాటు 60 అడుగుల జాతీయ జెండాను ఏర్పాటు చేయటంతో మరింత నిండుదనాన్ని తీసుకువచ్చింది. పట్టణాభివృద్ధి విషయంలో శ్రద్ధ చూపక పోగా కక్ష సాధింపు చర్యల్లో భాగంగా విగ్రహాలను తొలగిస్తూ, అభివృద్ధిని ధ్వంసం చేస్తూ దుశ్చర్యలకు పాల్పడుతుండటం హేయమైన చర్యగా ప్రజలు అభిప్రాయపడుతున్నారు.